క్లుప్తంగా

నేటి నుంచి ఖోఖో, కబడ్డీ పోటీలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, బాలానగర్ మండలాల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అండర్–14, 17 బాలబాలికలకు ఈనెల 11, 12వ తేదీల్లో ఎస్‌జీఎఫ్‌ఐ జోనల్ స్థాయి క్రీడలు ఫిరోజ్‌గూడలోని ఎన్‌ఎస్‌కేకే స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జోనల్ సెక్రటరీ సురేష్ తెలిపారు. 11వ తేదీన ఖోఖో, 12వ తేదీన కబడ్డీ పోటీలు ఉంటాయని తెలిపారు. స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్‌నం94414 59922లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



కేవీఎస్ఎన్ రాజుకు తన దరఖాస్తు ఇస్తున్న బీజేపీ నేత మల్లారెడ్డి

సుభాష్‌నగర్: రానున్న అసెంబ్లీలో ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. బీజేపీ నుంచి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థానానికి తనకు టికెట్ కేటాయించాలని ఆదివారం పార్టీ ఆఫీస్ సెక్రటరీ కేవీఎస్ఎన్ రాజుకు దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.

నియామకం



పసుల వెంకటేష్ ముదిరాజ్

సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా కుత్బుల్లాపూర్‌కు చెందిన పసుల వెంకటేష్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా ఆదివారం బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి నాయకులు పత్తి రఘుపతి, చెంది శ్రీనివాస్, భీమరాజు, రాచకొండ రాజు, మంద మహేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్రలోని సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో ఆదివారం ఉపాధ్యాయుల దినోత్సవం, కృష్ణాష్టమి వేడుక సంబరాలు అంబరానంటాయి. చిన్నారులు శ్రీకృష్ణులు, సత్యభామ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సరిశెట్టి సుందరరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన సాంకేతికత ఆధారంగా, వినూత్న పద్ధతులతో వ్యవసాయదారుల ఉన్నతమైన భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామని గ్రోవెర్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు పీజే శ్రీకాంత్ తెలిపారు. సుస్థిర వ్యవసాయ ప్రక్రియ, ఆహార భద్రతపై తమ సేవలను ఆంధ్రప్రదేశ్‌తో పాటు బెంగళూరులోనూ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ భవిష్యత్ ప్రణాళికలను ప్రకటించారు. రైతులు పంటలు పండించే విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, ఉత్పాదకతను పెంచడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఇందులో భాగంగా సాంకేతికతను రైతుల చెంతకు చేర్చేలా వేదికలను రూపొందిస్తున్నామన్నారు.

కత్తిపద్మారావు దళిత తత్వశాస్త్ర ప్రతిపాదకుడు

రాయదుర్గం: దళిత తత్వశాస్త్ర ప్రతిపాదకుడు డాక్టర్ కత్తిపద్మారావు అని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సేవ తెలుగు భాషా, సాహితీ సాంస్కృతిక సంస్థ నెల్లూరు, తిరుపతి వారి ఆధ్వర్యంలో అంతర్జాలం ద్వారా జరుగుతున్న డాక్టర్ కత్తి పద్మారావు సాహితీ సప్తాహంలో భాగంగా ఆదివారం ఆయన గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ద్వారా మాట్లాడారు. దళితుల అభ్యున్నతి జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్ తాత్విక ఆలోచనలతోనే ముడిపడి ఉందన్నారు. తెలుగులో జాషువా సాహిత్యంలో తొలిసారిగా ప్రచారం చేశారని, దళిత తాత్విక శాస్త్రాన్ని రూపొందించి ప్రచారం చేసిన గొప్ప సాహితీవేత్తగా కత్తిపద్మారావు గుర్తింపు పొందారన్నారు.

తవ్వి నెలలాయె.. పనులు చేపట్టకపాయె!



రంగారెడ్డినగర్‌లోని రెయిన్ బో స్కూల్ సమీపంలో ఓ గల్లీలో రోడ్డు వేయని దృశ్యం



రంగారెడ్డినగర్‌లోని ఓం జెండా సమీపంలో మ్యాన్‌హోళ్లు పైకి తేలిన రోడ్డు



గురుమూర్తినగర్‌లోని మున్నూరు కాపు సంఘం కార్యాలయం ఎదురు గల్లీలో రోడ్డు దుస్థితి ఇలా

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనుల కోసం అధికారులురోడ్లను తవ్వి నెలలు గడుస్తున్నా వాటిని పునరుద్ధరించక పోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డినగర్ ఎనిమిది నెలల క్రితం ఓం జెండా, రెయిన్‌బో స్కూల్ సమీపంలోని రెండు గల్లీల్లో, అదే విధంగా రెండు నెలల క్రితం గురుమూర్తినగర్‌లోని మున్నూరు కాపు సంఘం కార్యాలయం ఎదురుగా ఉన్న గల్లీలో జలమండలి ఆధ్వర్యంలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో పైపులైన్‌లు వేసేందుకు రోడ్లను ధ్వంసం చేసిన అధికారులు ఆ తరువాత ప్యాచ్ వర్క్‌లు చేయకుండా వదిలేశారు. దీంతో అప్పటి నుంచి కొత్త రోడ్లు వేయాలని పలుమార్లు స్థానికులు సర్కిల్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అటు జలమండలి కార్యాలయానికి వెళ్తే డ్రైనేజీ లైన్ పనులు వరకే తమ బాధ్యతని, రోడ్డు వేయడం సర్కిల్ అధికారుల పని అని చెబుతున్నారు.

◆ ఇలా నెలలుగా కాలయాపన చేస్తూ రావడంతో రోడ్లపైకి తేలిన మ్యాన్‌హోళ్లు, కంకర తేలిన రోడ్లతో ఆ గల్లీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిక్షేపంలాంటి రోడ్డును ధ్వంసం చేసి ఇప్పుడు పునరుద్ధరించకుండా కుంటి సాకులు చెబుతున్నారని అధికారుల తీరుపై స్థానికులు మండి పడుతున్నారు. ఇక వర్షాకాలం మొదలు కావడంతో రోడ్ల పనులు ఇప్పుడే చేపట్టడం కుదరని సర్కిల్ అధికారులు పేర్కొంటున్నారు. భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే టెండర్లకు పిలిచి రోడ్డు పనులు పూర్తి చేసి ఉంటే తమకు ఇబ్బందులు తప్పేవని, ఇరు శాఖల అధికారుల సమన్వయం లోపంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. – కుత్బుల్లాపూర్



జగద్గిరిగుట్ట చెక్ పోస్ట్ వద్ద ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జగన్



ఐలమ్మ వర్ధంతిలో పాల్గొన్న మెట్‌కానిగూడలో రజక సంఘం నాయకులు



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు భరత్‌గౌడ్

మౌలిక సదుపాయల కల్పనకు పెద్దపీట



రేణుకాఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన శ్రీహోమ్ కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: మౌలిక సదుపాయల కల్పనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజవకర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా ఆయను సానుకూలంగా స్పందించారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ హోమ్స్ కాలనీ వాసులు తమ పాంతంలో రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజును కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్లు కొలన్ వీరేందర్‌రెడ్డి, సురేష్ రెడ్డి, నాయకులు వెంగయ్య చౌదరి, కాలనీవాసులు రవి, విజయ్, రామోజీ, శశి, శశిధర్ రెడ్డి, కిరణ్, వెంకటేశ్వర రావు, అనిత, తాళ్లూరి ప్రదీప్ తదితరులు ఉన్నారు.

◆ దుండిగల్ మున్సిపల్ పరిధి శంభీపూర్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో జరిగిన అమ్మవారి కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ శంబీపూర్‌రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కళ్యాణోత్సవంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గజ్జ పూజ



నాట్య గురువు స్వరాజ్యలక్ష్మి, నిర్వాహకురాలు ఉప్పల అరుణకుమారితో చిన్నారులు

జగద్గిరిగుట్ట: గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలోని శ్రీ వసుదైక నిలయంలో ఆదివారం కూచిపూడి నాట్యాంశానికి సంబంధించిన గజ్జ పూజ జరిగింది. ఈ సందర్భగా నాట్య గురువు స్వరాజ్యలక్ష్మి, నిర్వాహకురాలు ఉప్పల అరుణకుమారి మాట్లాడుతూ.. కళలు భారతీయ సంస్కృతిలో భాగమని వాటిని మనం పరిరక్షించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వివిధ కళలల్లో ప్రోత్సహించి.. మనోధైర్యంతో ముందుకు సాగనంపితే సంస్కృతి సంప్రదాయాలకు వారసులుగా తయారవుతారని వారు పేర్కొన్నారు.

తండ్రి చూపిన బాటలో ప్రజాసేవ చేస్తా

బీజేపీ కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది కార్యకర్తలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందించామన్నారు. నేను చూపిన బాటలో తన తనయుడు రవికుమార్ యాదవ్ కూడా ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అందుకు మీ ఆశీర్వాదాలు కావాలని ఆయన కోరారు. అనంతరం రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తండ్రి చూపిన బాటలో నడుస్తూ నాయకులు, కార్యకర్తల సూచన మేరకు నడుచుకొని నియోజకవర్గ అభివృద్ధి చేస్తానన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో అందరి ఆశీర్వాదాలు ఉండాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, వెంకటస్వామిరెడ్డి, జానకీరామరాజు, నరసింహాచారి, నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పాలన



కేఎం పాండు మెమోరియల్ ట్రస్ట్ నిర్మిస్తున్న సంక్షేమ భవన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ప్రజాసంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ మధుసూదన్‌రెడ్డినగర్‌లో ఆదివారం కేఎం పాండు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించనున్న సంక్షేమ సంఘం భవనానికి ఎమ్మెల్యే మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీవాసులు స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు అండగా ఉంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటామని తీర్మానం చేసి ఘనంగా సత్కరించారు. కాలనీ ప్రెసిడెంట్ నాగన్న, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, కోశాధికారి మధు, ప్రసాద్ రావు, రఘుమారెడ్డి, చెన్నయ్య, కుమార స్వామి, రమేష్, సంతోష్, శేషగిరి రావు, మల్లేష్, ఎస్‌పీఎస్ కుమార్, మూర్తి, నాయుడు, పుల్లారావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బాలికలు అదృశ్యం

జగద్గిరిగుట్ట: వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు బాలికలు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్ పరిధిలోని సంజయ్‌పురి కాలనీకి చేందిన శ్రీజ (16) 9వ తరగతి చదువుతోంది. మగ్దూంనగర్‌లోని తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరింది. కాని ఇంటికి తిరిగి రాలేదు. తెలిసిన స్నేహితుల, బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో అక్కాచెల్లులు..

ఎల్లమ్మబండలో ఉంటున్న ఇద్దరు అక్కా చెల్లెళ్లు శ్రవంతి (17), దీపిక (15) శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితుల దగ్గరకు వెళ్లారేమో అని సాయంత్రం వరకు వేచి చూసారు. కాని రాకపోవడంతో చుట్టూ పక్కల తెలిసిన బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈత కొట్టేందుకు వెళ్లి వ్యక్తి గల్లంతు

కుత్బుల్లాపూర్: మద్యం సేవించి ఈత కొట్టేందుకు చెరువులోకి దిగిన వ్యక్తి గల్లంతైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన నాసర్‌ఖాన్(58) ఆదివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో పూటుగా మద్యం సేవించి సమీపంలో ఉన్న ఫాక్స్‌సాగర్ చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో మత్తులో ఉన్న నాసర్‌ఖాన్ నీట మునిగాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో ఫాక్స్‌సాగర్ చెరువులో గాలింపు చేపట్టారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు పల్టీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ వివేకానందనగర్ కాలనీలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయిన కారు పల్టీ ఢీకొట్టింది. ఆదివారం సాయంత్రం వివేకానందనగర్ కాలనీ చిత్తారమ్మ దేవాలయంకు వెళ్లే మూలమలుపులో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అక్కడే మూల మలుపులో ఉన్న రాయినెక్కించి కారు పల్టీ కొట్టింది. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారికి చిన్నపాటి గాయాలు మాత్రమే అయ్యాయి. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు పల్టీ కొట్టడంతో కారులో ఉన్న వారికి పెద్ద పెను ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

నిజాంపేట్: చెరువులో గల్లంతైయిన వ్యక్తి కోసం అధికారులు ఆదివారం సాయంత్రం నుంచి గాలింపు చేపట్టారు. కాని అప్పటి వరకు ఇంకా ఆ వ్యక్తి జాడ కనిపించలేదు. పూర్తి వివరాల్లోకి వెలితే..నిజాంపేట్ 12 వార్డు సమీపంలోని దస్తగిరి కుంటలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి దూకడని కొందరు స్థానిక నాయకులకు చెప్పడంతో ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు గాలింపు చేపట్టారు. శనివారం రాత్రి వరకు గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు చీకట్లో గాలింపు చేపట్టడం కష్టతరమవడంతో తిరిగి ఆదివారం ఉదయం నుంచి గాలింపు చేపట్టిన ఫలితం లేకుండా పోయింది. ఆత్మహత్య చేసుకోవడానికి ఏవరైన చెరువులో దూకారా? అనే కోణంలో పోలీసులు దర్యప్తు చేపట్టారు. అయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా ఎలాంటి మిస్సింగ్ కేసులు కూడా నమోదు కాలేదు. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇక్కడకు వచ్చి చెరువులో దూకారా? అనే విషయాలను పోలీసులు పరిగణలోకి తీసుకుని చర్యలు చేపడుతున్నారు.



గాలింపు చేపడుతున్న డీఆర్ఎస్ సిబ్బంది

ఆలయ స్థలంలో నిర్మాణాలు చేపట్టడమేంటీ?



మిట్టు భూక్యా గుడి ప్రాంతంలో ఆక్రమణలను తొలగిస్తున్న బంజారాలు

సుభాష్‌నగర్: తాతల నాటి నుంచి మా ఆరాధ్య దైవమైన దేవాలయం స్థలంలో నిర్మాణాలు చేపట్టడం ఏమిటని బంజారాలు కన్నెర్ర చేశారు. దీంతో బంజారాలు ఏకమై అట్టి నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో అక్కడ రణరంగం ఏర్పడింది. దుండిగల్ మున్సిపల్ బహదూర్ పల్లి చౌరస్తాను అనుకొని మిట్టు భూక్యా మహారాజ్ దేవాలయం ఉంది. సదరు స్థలంలో ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టడంతో విషయం తెలుసుకున్న బంజారాలు పెద్ద ఎత్తున ఆదివారం అక్కడ చేరుకొని నిర్మాణాలను తొలగించారు. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకొని వారిని శాంతింపజేయ ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది.

◆ ఈ సందర్భంగా బంజారా వాళ్లు మాట్లాడుతూ... మెదక్ జిల్లా కొడిపల్లి మండలం రాజ్‌పేట తండాకు చెందిన మా ముత్తాత మిట్టు భూక్యా గతంలో ఆవులు మేపుతూ బహదూర్‌పల్లి వరకు వచ్చే వారన్నారు. ఈ క్రమంలో ఆయన చనిపోవడంతో ఆయన పేరుమీద దేవాలయం నిర్మించారన్నారు. సుమారు 2 ఎకరాల 4గుంటల విస్తీర్ణంలో ఉన్న దేవాలయం ప్రాంగణంలో అప్పటి నుంచి నిత్యం ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. నరసాపూర్, మెదక్, ఇతర ప్రాంతాల్లో బంజారా వాళ్లు ఇక్కడికి వస్తుంటారని, ప్రతి ఏటా ఇక్కడ జాతర కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ సదరు స్థలం ప్రథమ రహదారి పక్కన ఉండడంతో కోట్ల రూపాయల ధర పలుకుతోందన్నారు. ఈ స్థలం మీద కన్నేసిన కొంతమంది ఇది ఆక్రమించడానికి ప్రయత్నిస్తే మేము కోర్టు కూడా వెళ్లామని తెలిపారు. ఈ స్థలాన్ని కాజేయాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా బంజారాలంతా పెద్ద ఎత్తున ఆందోళ చేపడతామని హెచ్చరించారు.

నాలాలపై గ్రిల్ మెష్‌ల ఏర్పాటు



నాలాపై గ్రిల్ మెష్‌లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

• ఎట్టకేలకు స్పందించిన అధికారులు





నిజాంపేట్: వర్షాకాలంలో నాలాల్లో ప్రమాదాలు జరుగకుండా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల నాలలో పడి మిథున్ రెడ్డి అనే బాలుడు మృతి చెందిన సంఘటనతో అప్రమత్తమైన అధికారులు ఎట్టాకేలకు స్పందించి చర్యలు చేపట్టారు. ఎన్ఆర్ఐ కాలనీ నుంచి సాయినగర్,అదిత్య గార్డెన్స్ మీదుగా తుర్కు చెరువు వరకు ఉన్న నాలాలపై పై కప్పులు, అవసరమైన చోట మెష్‌లు,గ్రీల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు పనులు ప్రారంభించారు. అలస్యంగానైన అధికారులు స్పందించినందుకు స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ నాలాపై ఏర్పాటు చేసిన పై కప్పు సక్రమంగా లేదు. దీంతో ఈ నాలాలో అనేక మంది పడి గాయాలపాలైన వారు సైతం ఉన్నారు. వర్షాకాలంలోనే కాకుండా నాల ఓపెన్‌గా ఉండటంతో ప్రమాదాలు జరిగేవి. ఈ నాలా ఎప్పకప్పుడు శుభ్రంగా ఉండేందుకు సైతం అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ నీరు జామ్ అయ్యి స్థానికంగా తీవ్ర దుర్గందం ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రమాదాలు జరిగిన సమయంలోనే స్పందించి తరువాత విస్మరించడం సరైంది కాదని స్థానికులు వాపోతున్నారు.

బొడ్రాయిని గ్రామ దేవతగా కొలుచుకుంటాం



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: బొడ్రాయిని గ్రామ దేవతగా కొలుచుకుంటామని.. అలాంటి బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొనడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి నందానగర్‌లోని శ్రీలక్ష్మి భూలక్ష్మి సమేత శ్రీతలాంబ బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... ప్రజలకు ఎలాంటి అరిష్టాలు తలెత్తకుండా బొడ్రాయి రక్షణగా ఉంటుందన్నారు. బొడ్రాయి స్థాపనతో నందానగర్ ప్రజలకు అంతా మంచే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కె.ఎం.ప్రతాప్, సంక్షేమ సంగం అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు హరిబాబు, శంకర్, పెద్ద నరసింహారావు, చిన్న నరసింగరావు, సురేష్, బుచ్చిరెడ్డి, రాజేష్ గౌడ్, మధు, శివ, బొడ్రాయి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.